క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం రేపు

కురుపాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.వి.శివరామప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా గ్రామదేవత పండగ



గ్రామ వీధుల్లో బంగారమ్మతల్లి ఘటాల ఊరేగింపు

భామిని: మండలంలోని నేరడి–బి గ్రామంలో బంగారమ్మతల్లి గ్రామదేవత పండగ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మేళతాళాల నడుమ మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి ఘటాలు, పాలజంగిడిని వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

గర్భిణులకు ప్రత్యేక వైద్యసేవలు



ఆస్పత్రిలో వైద్యపరీక్షల కోసం వేచి ఉన్న గర్భిణులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు సోమవారం ప్రత్యేక వైద్యసేవలు అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో బీపీ, రక్తహీనత వంటి పరీక్షలు చేసి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను సిబ్బంది వివరించారు. కాన్పు జరిగేంత వరకు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించిన మరిడమ్మతల్లి విగ్రహం

పాలకొండ రూరల్: మండలంలోని వీపీ రాజుపేట గ్రామ సమీపంలో నిర్మించిన శ్రీమరిడమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. యజ్ఞకర్త శర్మయాజీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

వ్యవసాయ రాయితీలను సద్వినియోగం చేసుకోండి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న వ్యవసాయ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు కోరారు. మండలంలోని తంపటాపల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన అక్కడి పలు రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. సమస్య పరిష్కారానికి సచివాలయం గడప తొక్కే ప్రతీ ఒక్కరి సమస్య పరిష్కారం కావాలన్నారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, వాహనాలను తీసుకోవాలన్నారు.

విత్తన రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పాలకొండ: మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని కొండాపురం గ్రామంలో రైతులతో సోమవారం సమావేశమైన వ్యవసాయ శాఖ సిబ్బంది ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారు. నేల స్వభావాన్ని బట్టి పంట వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వరి, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి.నీలిమ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: ర్యాలీలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్



కురుపాం: కస్పాగదబవలస గ్రామంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ పద్మావతి



సీతంపేట సచివాలయంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ సత్యం, సర్పంచ్‌లు కళావతి, ఆదిలక్ష్మి

● పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులంతా మానవ మనుగడ సాగాలంటే పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి, అది పెద్దయ్యేంత వరకు సంరక్షించాలని తెలిపారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన వాతావరణ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, పలు మొక్కలు నాటారు. –సాక్షి నెట్‌వర్క్



భామిని: కోసలి గ్రామంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు



పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలుపుతూ తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

సీఎం జగన్‌తోనే పారదర్శక పాలన

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో పారదర్శకన పాలన సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదమేరంగి గ్రామంలో సోమవారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా 'సంక్షేమ' సంతోషం నెలకొందన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంత వరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తేవాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శశికళ, డీసీసీబీ డైరెక్టర్ ఎల్.నారాయణరావు, మాజీ ఎంపీపీ జి.చంద్రయ్య, సర్పంచ్ ఆర్.అనూరాధ, వైస్ సర్పంచ్ సంతోషి, వి.నారాయణరావు, బి.వెంకటరమణ, ఎ.ఈశ్వరరావు, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల వివరాలు ఇవ్వండి



ఇన్‌చార్జ్ తహసీల్దార్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

గరుగుబిల్లి: దేవదాయ భూముల వివరాలు తెలిపే రికార్డులు ఇవ్వాలని దేవదాయ శాఖ సిబ్బంది కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ పి.ఎల్.కుమార్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్, జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో చేపట్టిన భూముల రీసర్వేలో గ్రామకంఠాలు, పోరంబోకు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలతో పాటు దేవదాయ భూముల వివరాలు కూడా సర్వేయర్లు నమోదు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో దేవదాయ భూముల వివరాలు తెలిపే నివేదికలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది ఎం.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



కృష్ణారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భామిని: మండలంలోని కొరమ గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త అగతముడి కృష్ణారావు(67) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, బీసీ సెల్ అధ్యక్షుడు అగతముడి రఘు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ సోమవారం ఆ గ్రామం చేరుకుని, మృతదేహంపై పూలమాలలు ఉంచి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

గిరిజన 'స్పందన'కు 31 వినతులు



వినతులు స్వీకరించి, పరిశీలిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్.ఆర్.శంకరన్ మీటింగ్ హాల్లో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి 31 వినతులు వచ్చాయి. వీటిని ఏపీఓ రోసిరెడ్డి పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

వినతుల్లో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని చిన్నమల్లిపురానికి చెందిన సరోజిని, వంతవాడకాలనీలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని వెంకయ్య, కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కడంబసింగికి చెందిన అప్పారావు, పేపర్‌ప్లేట్లు తయారు చేసే యంత్రం మంజూరు చేయాలని హిమగిరికి చెందిన సుస్మిత, సీసీ రోడ్డు వేయాలని బెన్నడుగూడకు చెందిన లక్ష్మీనారాయణ, అంబలగండి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మించాలని కృష్ణయ్య, సబ్సిడీపై జిరాక్స్ మెషిన్ మంజూరు చేయాలని సవర చీపురుపల్లికి చెందిన పావని కోరారు.

38 మద్యంసీసాల స్వాధీనం

జియ్యమ్మవలస: మండలంలోని మాదలింగి గ్రామానికి చెందిన కె.బాబ్జి వద్ద నుంచి 38 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కళాధర్ సోమవారం తెలిపారు. పెదమేరంగి జంక్షన్ నుంచి ఆయన అక్రమంగా వాటిని తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: ఎంపీడీఓగా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ దగ్గరున్న కిర్లంపూడి మండలంలో ఈఓపీఆర్‌డీగా పని చేసి, ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

పాలకొండ రూరల్: భూముల రీసర్వే పక్కాగా చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో జరుగుతున్న సర్వేను సోమవారం పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరగాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్‌ఓలు బి.సాయి శ్రీనివాస్, రామారావు, సహాయక సర్వేయర్లు నాగరాజు, మనికుమార్, శ్రావణ్‌కుమార్, జయసుధ, మేఘన పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించండి

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు దావాల రమణరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలిసి, సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం అక్కడి అధికారులకు వినతిపత్రం అందజేశారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కె.రాము, టి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలేరులో నేత్రవైద్య శిబిరం



మహిళ కంటిని పరీక్షిస్తున్న నేత్రవైద్యాధికారి కృష్ణారావు

భామిని: డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పథకంలో భాగంగా మండలంలోని బాలేరు గ్రామ సచివాలయంలో ఉచిత నేత్రవైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారి కళ్లను నేత్రవైద్యాధికారి కె.కృష్ణారావు పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. దృష్టిలోపంతో బాధపడుతున్న వారికి శస్త్రచికిత్స, అవసరమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు.

వాహన తనిఖీలు



వాహనదారుడి వాహన పత్రాలు పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్‌లో సోమవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టిన ఆయన ఆ దారిలో వచ్చిపోయే వాహనాలను ఆపి, వాహనదారుల లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. లైసెన్సులు లేని, హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధించి, వసూలు చేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఆర్‌బీకేలకు చేరుకున్న విత్తనాలు



ఆర్టీసీ లగేజీ బస్సులో తీసుకువచ్చిన వరి విత్తనాల బస్తాలు

సీతంపేట: స్థానిక రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)కు ఖరీఫ్ వరి విత్తనాలు సోమవారం వచ్చి, చేరుకున్నాయి. ప్రత్యేక ఆర్టీసీ లగేజీ బస్సులో సాంబ, స్వర్ణమసూరు, ఆర్‌జీఎల్, 1061, 1064, 1121 వంటి రకాల విత్తనాల బస్తాలు వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి తిలక్ తెలిపారు. వీటిని 90 శాతం సబ్సిడీపై ఇక్కడి గిరిజన రైతులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్యసేవలు



రోగులకు ఆరోగ్య సలహాలిస్తున్న అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్

పాలకొండ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాపురం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వైద్యారోగ్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచానపడి బాధపడుతున్న వారికి వైద్యం చేశారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకుని, ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కురుపాం: స్థానిక సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో సోమవారం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. కురుపాం, శివ్వన్నపేట, పూతికవలస, పాతకురుపాం గ్రామాల నుంచి దాదాపు 500 మంది హాజరై, అన్నప్రసాదం స్వీకరించారు. అంతకుముందు ఆలయంలో బాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కె.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన మహోత్సవానికి తరలిరండి

సీతంపేట: గుంటూరులో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీలో ఈ నెల 12వ తేదీన జరిగే విత్తన మహోత్సవానికి రైతులంతా తరలిరావాలని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.సీతారాం సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొత్త రకం నువ్వుల విత్తనాలతో పాటు వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉంటాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాధుల బారినపడకుండా జాగత్రలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: రానున్న వర్షాకాలంలో వ్యాధులు విజృంభిస్తాయని, వాటి బారినపడకుండా జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రజలకు సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన ఆమె ఆస్పత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎటువంటి రిఫరల్ కేసులు లేకుండా పనిచేయాలని కోరారు. రోగులకు సమయానికి పౌష్టికాహారం, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు జరిగిన ఆస్పత్రి అభివృద్ధి పనులపై చర్చలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు భవనాలు నత్తనడకన సాగడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన నిర్మించకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. త్వరలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరిగితే ఎంతోమందికి కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, సర్పంచ్ ఆరిక కళావతి, ఏఎంసీ చైర్మన్ హిమరక మోహన్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.